క్లుప్తంగా

ఉపాధి పనులు తనిఖీ



టక్కోలులో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం : మండలంలోని టక్కోలు, కడపాయపల్లె గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టక్కోలు చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను, కడపాయపల్లెలోని పండ్ల తోటలను, ఫారం పాండ్ పనులను, వర్మీ కంపోస్టు పెట్టెలను, పశువుల నీటి తొట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ గ్రామాలలో ఉపాధి హామీ పనులను జరిపించాలన్నారు. అలాగే పనులకు వచ్చిన కూలీలందరికి రూ. 300లు కూలి వచ్చేటట్లు మార్కింగ్ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



అలంకారంలో ఎల్లమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి పంచాయతీ కె.అగ్రహారంలో శనివారం శ్రీ ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఈ మహోత్సవానికి ముక్కా సాయివికాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు జాతర వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ నీలిపల్లి గ్రామానికి చెందిన షేక్ బాషా కుమార్తెకు నూతనంగా వివాహం జరిగింది. శనివారం వారి స్వగృహంలో నూతన వధూవరులను వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆశీర్వదించారు. ఆయనతో పాటు గొబ్బిళ్ల త్రినాథ్ యాదవ్, గోల్డ్ మస్తాన్, గుండు మల్లికార్జునరెడ్డి, ఇబ్బు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పూజలందుకున్న నారసింహుడు



రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పలువురు పాల్గొనగా తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటి పట్టణం కొత్తపేటలోని గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసియున్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూల విరాట్ మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకుపూజలు, సింధూర పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో మారెమ్మ



దర్శనమిస్తున్న మారెమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని వెలసిన గ్రామ దేవతలు మారెమ్మ, కాళికాదేవిల తిరునాల మహోత్సవంలో భాగంగా శనివారం అభిషేకాలు, హోమ కార్యక్రమాలను నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడికాలువ గట్టుపై వెలసిన అమ్మవారి ఆలయంలో ప్రతి ఏడాది ఎంతో వైభవంగా అమ్మవారి తిరునాల మహోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం అమ్మవారికి గ్రామస్తులందరూ కలిసి బోనాలను సమర్పిస్తామని తెలియజేశారు.

అటకెక్కిన అర్జీలు.. కలగానే సొంతిళ్లు

- ఏడాది కాలంగా హామీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో అర్హతే ఆధారంగా ఇళ్ల కేటాయింపు
- కాలనీ ఏర్పాటు, సౌకర్యాల కల్పనలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విశేష కృషి



గాలివీడు మండలంలో ఏర్పాటైన జగనన్న కాలనీలో లబ్ధిదారుల గృహాలు

గాలివీడు : రాష్ట్రంలో పాలన ఏడాది కాలంగా గాడి తప్పిందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, భారతీయ జనతా పార్టీలు పొత్తులో భాగంగా కూటమిగా ఎన్నికలకు వెళ్లాయి. ఉమ్మడి మేనిఫెస్టో సైతం విడుదల చేశాయి. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జనాలను ఆకర్షించేందుకు ఇచ్చిన వందలాది హామీలలో ఇళ్ల నిర్మాణం అనేది ఒకటి. ఇళ్లు లేని గ్రామీణ పేదలకు 3 సెంట్లు, పట్టణ పేదలకు 2 సెంట్లు అందజేయడమే కాక ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు (కేంద్ర సాయంతో కలిపి) అందజేస్తామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలు బాబు చెప్పిన హామీకి ఆకర్షితులై ఆయనకు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు తాము ఇచ్చిన హామీలను మరిచినట్టు ఉన్నారు. ఏడాది పూర్తి అయినా గాలివీడు మండంలో ఏ ఒక్క లబ్ధిదారుడికి ఇంటిని మంజూరు చేసిన దాఖలాలు కనిపించడంలేదు. ఒక్క గాలివీడు మండంలోనే ఇళ్ల కోసం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2750 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోలేని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు. తమ సొంతింటి కళ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటే కూటమి పాలకులు దానిని పట్టించుకోవడం లేదనే ఆవేదన దరఖాస్తుదారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

నాడు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ..

ఇచ్చిన హామీలను తూచా తప్పక పాటించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ. మేనిఫెస్టోని భగవద్గీతగా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి విశ్వసనీయత అంటే ఏంటో తెలియజేసేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి నిర్మాణాలను కాకుండా ఊర్లనే నిర్మించారన్న వాదన ప్రజల్లో ఇప్పటికీ వినిపిస్తోంది. ఇళ్లు లేని పేదవాడు ఉండకూడదు అనే బృహత్ సంకల్పంతో ప్రతి ఒక్క అర్హుడికి ఇంటిని కేటాయించాలని నిర్ణయించడమే కాక అధికార గణం ఆ దిశగా కార్యాచరణ జరిగించేలా పర్యవేక్షించారు. రాయచోటి నియోజకవర్గంలో వేలాది మంది నిరుపేదలు తమ సొంతింటి కళను అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నేరవేర్చేందుకు కంకణం కట్టుకుని లబ్ధిదారులకు న్యాయం చేశారు.

నియోజకవర్గంలో అందరికి ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో శ్రీకాంత్‌రెడ్డి చేసిన కృషిని ప్రజలు మననం చేసుకుంటున్నారు. గాలివీడు మండలంలో వైఎస్సార్‌సీపీ హయాంలో 20 లే అవుట్‌లలో 3376 లబ్ధిదారులకు సొంతిళ్లు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికే దక్కుతుంది. కాగా రామాపురం మండలంలో మంజూరైన గృహాలు 1788, 13 లే అవుట్లు ఉన్నాయి. అలానే లక్కిరెడ్డిపల్లె మండలంలో 2030 మంజూరు కాగా 5 లేఅవుట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో ఏర్పాటైన లేఅవుట్‌లలో సౌకర్యాల కల్పనకు శ్రీకాంత్‌రెడ్డి తీసుకున్న చర్యలు లబ్ధిదారులు కొనియాడుతున్నారు. అది అలా ఉంటే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క ఇంటిని మంజూరు చేయకపోవడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటకెక్కిన దరఖాస్తుల దుమ్ము విదిలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు.

నేటి నుంచి మడితాటమ్మ జాతర



సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీ మడితాటమ్మ (చిన్నక్క, పెద్దక్క) జాతరను ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రోజున ఉదయాన్నే పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అమ్మవార్లను అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు తెలియజేశారు. తదనంతరం అభిషేకములు, బోనాలు, రాత్రికి విద్యుత్ దీపాలంకరణలు, మేళతాళాలు, చెక్కభజనలతో చాందినీబండ్లతో నిండు తిరునాల జరుపుతున్నట్లు తెలిపారు. భక్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని వారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాల



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని మర్రిచెట్టు దగ్గర వెలసిన ఆంజనేయస్వామి తిరునాలను శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చిన్నగొల్లపల్లి వైఎస్ఆర్‌సీపీ సర్పంచ్ రామాజయచంద్ర ఆహ్వానం మేరకు వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి స్వామి వారి తిరునాలలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మండల నాయకులతో కలిసి అన్నసంతర్పణలో పాల్గొని తిరునాళ్లకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామజయచంద్ర, జిల్లా గిరిజన విభాగం అధ్యక్షుడు చంద్రానాయక్‌తో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పూజలు



పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఆలయ పూజారి చంద్రశేఖర్ స్వామి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య స్వాములు తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను అందజేశారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

గాలివీడు : రైతుల శ్రేయస్సు కోసం 90 శాతం సబ్సిడీతో విత్తనాలను మంజూరు చెయ్యాలని రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన రైతు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల ప్రకారం ఈ నెల 26న అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. మండలంలోని రైతులు పెద్దఎత్తున పాల్గొని నిరసను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నందున రైతులందరూ దుక్కులు చేసుకుని వ్యవసాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి తరుణంలో విత్తనాలు రైతులకు 90 శాతం సబ్సిడీతో అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వేరుశనగ, వరి, ప్రొద్దుతిరుగుడు, ఉలవలు, అలసందలు, కందులను సబ్సిడీతో మంజూరు చేయడమే కాక అన్ని రకాల ఎరువులు సబ్సిడీ కింద పంపిణీ చేయాలన్నారు. ఇదే సీజన్‌లో ఒక వైపున క్రాప్ లోన్‌లు రైతుల రెన్యువల్ చేసుకునే టైం ఆసన్నమైంది గనుక బ్యాంకుల్లో వడ్డీ మొదలు కట్టించుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. రైతులకు కేవలం వడ్డీ కట్టించుకొని రైతులకు క్రాప్ లోన్ రెన్యువల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, సుధాకర్, వెంకటరమణారెడ్డి, రాజారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను సన్మానిస్తున్న వడ్డెర మేధావుల ఫోరం నాయకులు

రాయచోటి టౌన్ : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేరంగుల లక్ష్మీ ప్రసాద్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా వడ్డెర మేధావుల ఫోరం నాయకులు సన్మానించారు. శనివారం ఆయన ఛాంబర్‌లో కలసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వడ్డెరలు సామాజికంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని అందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు గానే జిల్లా స్థాయిలోని అన్నిశాఖ అధికారుల సమస్యలను రాష్ట్ర స్థాయి నాయకులతో చర్చించి ఎలాంటి సమస్య అయినా సామరస్యంగా పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ కె.జీవానందం, ఎస్ఆర్ఐ విభాగం అధ్యక్షులు దేరంగుల సిద్దు, సీపీఐ నాయకులు విశ్వనాథనాయక్, ఎస్ఆర్ఐ విభాగం ఉపాధ్యక్షులు నంద్యాల వెంకటరమణ, టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షులు రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పట్టించుకోని చమర్తి



నందలూరు : రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు టీడీపీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని రాజంపేట నియోజకవర్గ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కానకుర్తి వెంకటయ్య అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మా కుటుంబమంతా తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశామన్నారు. మమ్మల్ని చమర్తి జగన్‌మోహన్‌రాజు గుర్తించడం లేదని, నిజమైన కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దాడి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి



నాగసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల గ్రామం మార్లవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొరెడ్డి నాగసుబ్బారెడ్డిపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి శనివారం నాగసుబ్బారెడ్డిని పరామర్శించారు. దాడి జరిగిన విషయంపై ఆరా తీశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దాడిలో తీవ్ర గాయాలపాలైన నాగసుబ్బారెడ్డిని రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా తలకు పన్నెండు కుట్లు పడ్డాయని, చేతి వేలికి కూడా తీవ్రగాయం అయినట్లు తెలిపారు. నాగసుబ్బారెడ్డికి సంబంధించిన భూమిలో అన్యాయంగా అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీకి చెందిన అదే గ్రామస్తులు ఆక్రమించుకుంటుండగా అడ్డుకున్న నాగసుబ్బారెడ్డిపై దాడి పాల్పడినట్టు ఎంపీపీకి వివరించారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌తోపాటు ఎస్ఐకు ఫోన్ ద్వారా సమాచారం అందించి దాడి కారకులపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి కార్డుదారుడికి రేషన్ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు తిరుమల బాబు

సిద్దవటం : మండలంలోని రేషన్ షాపు డీలర్లు ప్రతి రేషన్ కార్డుదారుడికి రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దారు తిరుమల బాబు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శనివారం మండలంలోని రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రేషన్ షాపుకు సంబంధించి అడ్రస్ ఏదైతే ఇస్తారో అక్కడే రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని, షాపు వద్ద నేమ్ బోర్డులను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు రేషన్ షాపు తెరిచి ఉంచాలన్నారు. నెలలో 15 రోజులు రేషన్ ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. తూకాల్లో తేడాలు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. బియ్యం బస్తాలో 50 కిలోలు రావడంలేదని, 48, 47 కిలలోలు వస్తున్నాయని డీలర్‌లు తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా అంతా అలానే ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, సివిల్ సప్లయిస్ డీటీ సౌజన్య, ఆర్ఐ నరసింహ ప్రసాద్, వీఆర్‌వోలు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాభారత యజ్ఞం



శ్రీ కృష్ణలీలను వివరిస్తున్న భాగవతారిణి సీతామహాలక్ష్మి

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసివున్న శ్రీ మల్లూరమ్మ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. ప్రముఖ భాగవతారిణి సీతామహాలక్ష్మి శనివారం కర్ణ జననం, శ్రీ కృష్ణ లీలలను చూడముచ్చటగా వివరించారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలి



పూజలు చేయిస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుచుకొని దైవచింతనతో మెలగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోనంపేట వద్ద వెలసిన శివాలయంలో స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనంపేట గ్రామంలో నూతన శివాలయాన్ని నిర్మించడం శుభసూచికమన్నారు. పరమేశ్వరుడు ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, దప్పేపల్లి సర్పంచ్ కేశవయ్య, సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎర్రంరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు వినయ్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దప్పేపల్లి రవిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి బోరు కనుమరుగు!



లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని పెట్రోల్ బంకు సమీపంలో మట్టిలో పూడుకుపోయిన నీటి బోరు

లక్కిరెడ్డిపల్లి : ఈ బోర్ మోటార్‌ను కాస్త పట్టించుకోండి అంటూ లక్కిరెడ్డిపల్లి పంచాయతీ అధికారులను టౌన్‌కు చెందిన పలువురు ప్రజలు కోరుతున్నారు. రాయచోటి – చాగలమర్రి నేషనల్ హైవే విస్తరణలో భాగంగా లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న బోర్ మోటార్‌లో సమృద్ధిగా నీరు ఉండటంతో టౌన్ పరిధిలో ప్రజలకు తాగునీరు అందించే అవకాశం ఉందని, కానీ ఈ బోర్ మోటార్‌ను పూర్తిగా మట్టితో కప్పేయడంతో అటువైపు వెళ్లే గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకొని ఆశ్చర్యంగా చూస్తున్నారు. రోజురోజుకు రోడ్డు విస్తరణలో బోర్‌తోపాటు మోటార్ పైపులైన్ పూర్తిగా మట్టితో కప్పేస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఏమైనా మరమ్మతులు చేయాలంటే ఇబ్బందులు పడక తప్పదని, దీంతో లక్షల రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన బోరు నిరుపయోగంగా మారక తప్పదనే వాదనను ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ మోటార్ ద్వారా నీరు టౌన్‌కు అందుతుండటంతో వేసవిలో కొంత మేర ప్రజలకు ఉపశమనం కలుగుతోంది. నీటిని అందిస్తూ ఆదుకుంటున్న బోరుపై నిర్లక్ష్యం చూపకుండా పంచాయతీ అధికారులు మోటారు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం ప్రజానీకం కోరారు.

సారా స్వాధీనం ; వ్యక్తి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం వై.కోట గ్రామానికి చెందిన సుబ్బయ్యను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం సీఐ తులసీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా తయారీ చేసిన, నిల్వ ఉంచిన, రవాణాకు సహకరించిన, విక్రయాలలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గుంజనేరు ప్రొటెక్షన్ వాల్ తక్షణం నిర్మించాలి



మాట్లాడుతున్న సీహెచ్ రమేష్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని నరసరాంపేట వద్ద గుంజన నది ప్రొటెక్షన్ వాల్‌ను తక్షణం నిర్మాణ పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్ శనివారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాషా చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు. శనివారం వారు మాట్లాడుతూ నరసరాంపేట వాసులు గుంజన నది వరదలు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంజూరై నిర్మాణం మొదలు పెట్టాల్సిన పనిని ఏడాది కావస్తున్నా ఇంకా ఎందుకు చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. తక్షణం కూటమి ప్రభుత్వం రక్షణ గోడను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోశాల దేవి, ఎనమాల చైతన్య, ఎంపీటీసీ అబ్దుల్ రౌఫ్, నాగేశ్వర యాదవ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న చలో విజయవాడ



నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాలు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జూన్ 5వ తేదీన విజయవాడలో చేపట్టనున్న నిరసనకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని శనివారం ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మ జాతర



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

వీరబల్లి : మండలంలోని గడికోట పంచాయతీలోని ఎడబల్లి దగ్గర వెలసిన గంగమ్మకు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. గంగమ్మ జాతరలో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు హోమ పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు విరివిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేయించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే చాందినీ బండ్లు కట్టి తప్పెట్లు తాళాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ గాలివీటి రాజేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, హైకోర్ట్ మాజీ జడ్జి సీవీ నాగార్జున రెడ్డి, రాజీవ్ రెడ్డి, నరేందర్, గ్రామ పెద్దలు, కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఈఓ ప్రసాద్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఈఓ ప్రసాద్ రావు శనివారం హెచ్చరించారు. పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కోడూరుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలోని అన్ని వీధులు పరిశుభ్రంగా ఉంచడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు వార్డు మెంబర్లు తమతమ పరిధిలోని సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుగు శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, వార్డు మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ఓబులవారిపల్లె : బోటిమీదపల్లి వీఆర్‌ఏగా పనిచేస్తున్న ఎస్.మహబూబ్ బాషా (56) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. బోటిమీదపల్లి వీఆర్‌ఏగా విధి నిర్వహణలో భాగంగా అందరితో సన్నిహితంగా ఉండే మహబూబ్ బాషా మృతిపట్ల పలువురు నాయకులు, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కాగా మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.